క్లుప్తంగా

అంబలి కేంద్రం ప్రారంభం



బాటసారులకు అంబలిని అందజేస్తున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్: లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని సీఐ శివ ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రం ప్రధాన కూడలిలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని క్లబ్ నిర్వాహకులతో కలిసి సీఐ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కేంద్రం ద్వారా 400 మందికి అంబలిని పంపిణీ చేశామని క్లబ్ పీఆర్‌ఓ పాషా తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మహేశ్, జూలూరి రమేశ్, రాజేందర్‌యాదవ్, తరుణ్, శ్యాంసుందర్, ముత్తికృష్ణ, రాజు, హీరాలాల్ తదితరులు ఉన్నారు.

ఎరువుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



మార్కెట్ యార్డులో ప్రారంభించిన కేంద్రం

ఇబ్రహీంపట్నం: రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో తాత్కాలికంగా ఎరువుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఈ కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి.. డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుజాత, ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విద్యాధరి, మార్కెట్ వైస్ చైర్మన్ కరుణాకర్, మార్కెట్ డైరెక్టర్లు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 8 దరఖాస్తులు



దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఓ నర్సయ్య

ఇబ్రహీంపట్నం: ప్రజావాణిలో 8 దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఏఓ నర్సయ్య తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణిలో ఏడు ధరణి, రైతు రుణమాఫీకి సంబంధించి ఒక దరఖాస్తు వచ్చిందని పేర్కొన్నారు. ఆయా శాఖలకు ఈ అర్జీలను పంపి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ప్రజావాణికి ఆర్డీఓ అనంతరెడ్డికి బదులు ఏఓ నర్సయ్య హాజరయ్యారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ కేవీపీ రాజు

మంచాల: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు అన్నారు. సోమవారం రాత్రి ఆస్మత్‌పూర్ గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన లేని కారణంగా నేరాలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించరాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లాలయ్య, ఏఎస్‌ఐ సతీష్ పాల్గొన్నారు.

పది పరీక్షలపై అవగాహన

మహేశ్వరం: పరీక్షలు భయం లేకుండా నిర్భయంగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని మోటివేషనల్ ట్రైనర్ లింగరాజు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ఏవిధంగా రాయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకొని పట్టుదలతో ముందుకెళ్తే జీవితంలో అనుకున్నది సాధించవచ్చన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని సూచించారు. అంతకుముందు పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి కటికల యాదగిరి, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, యాదగిరి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

శతశాతం సాధ్యమేనా?

- మిగిలింది నాలుగు వారాలే
- ఈ ఏడాది టార్గెట్ రూ.19.59 కోట్లు
- ఇప్పటి వరకు 35 శాతం వసూలు
- లక్ష్యం చేరువకు అధికారుల కసరత్తు



పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్: మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను. ఈ ఆర్థిక సంవత్సరం వసూలు లక్ష్యం రూ.19.59 కోట్లు కాగా.. ఇప్పటి వరకు రూ.6.35 కోట్లు మాత్రమే వసూలు అయింది. మిగతా టార్గెట్ రీచ్ అయ్యేందుకు ఇంకా నాలుగు వారాల గడువు ఉండగా.. నూటికి నూరు శాతం పన్ను ప్రజల నుంచి రాబట్టేందుకు పుర అధికారులు, సిబ్బంది తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

ముందుకు రాని పరిశ్రమలు!

గతేడాది మార్చి నెలాఖరు వరకు రూ.14.21 కోట్లుకు గాను 78శాతం మేర రూ.8.22 కోట్లు వసూలు చేసిన మున్సిపల్ అధికారులు.. ఈ ఏడు కాస్త స్పీడు తగ్గించినట్లు కనిపిస్తోంది. వందశాతం రాబడతామని చెప్పినా.. ఏ మేరకు సఫలం అవుతారనే సందేహం వ్యక్తమవుతోంది. పురపాలక సంఘం పరిధి ప్రైవేటు కళాశాలలు, మధ్యతరహా పరిశ్రమలు ఉండగా వాటిల్లో చాలావరకు మూడేళ్లుగా పన్ను చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు సమాచారం. వీటికి తోడు తాజాగా నాలుగు గ్రామ పంచాయతీలు పెద్దంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం కావడంతో, అక్కడి ప్రజలు ఇంటి పన్ను చెల్లించేందుకు ఆసక్తి చూపకపోవడం అధికారులకు సవాల్‌గా మారింది.

వడ్డీ మాఫీ ప్రకటించినా..

పన్ను చెల్లింపుదారులకు ఊరట ఇచ్చేందుకు చెల్లించాల్సిన పన్నుకు విధించిన వడ్డీని 90 శాతానికి పైగా ప్రభుత్వం మాఫీ చేసినా.. చాలామంది సద్వినియోగం చేసుకోవడం లేదు. పన్ను సకాలంలో చెల్లించి, మున్సిపల్ అభివద్ధికి తోడ్పాటునందించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ.. అధికశాతం వ్యాపారులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. వారి నిర్లక్ష్యం కారణంగా అధికారులు బలి కావాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

> **లక్ష్యం చేరుకుంటాం**
>
> అనుకున్న విధంగానే పన్ను వసూలు లక్ష్యం చేరుకుంటాం. వార్డుల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పర్యటిస్తున్నాం. ఇప్పటి వరకు 35 శాతానికి పైగా రాబట్టాం. నెలాఖరు వరకు మిగతాది వసూలు చేస్తాం. ప్రజలు సకాలంలో పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధి సహకరించాలి. వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి.
>
> – రవీందర్ రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో రాయితీ పొందండి

మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్



ఆమనగల్లు: 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్న భూ యజమానులు, మార్చి 31 లోగా పూర్తి ఫీజు చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ కోరారు. సోమవారం పుర కార్యాలయంలో కమిషనర్ మాట్లాడారు. నాడు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించిందని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన ఫీజు మొత్తాన్ని నెలాఖరులోగా చెల్లించి, రాయితీ పొందాలని సూచించారు. అనధికారిక లే అవుట్‌లలోని తమ ప్లాట్లను రెగ్యులర్ చేసుకోవడానికి ఇదొక గొప్ప అవకాశమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వినియోగించుకోండి

ఇబ్రహీంపట్నం: ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అనుమతిలేని లే అవుట్లలోని ఖాళీ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు 2020లో రూ.వెయ్యి చెల్లించి, రిజిస్టర్ చేసుకున్న వారికి మంచి అవకాశమన్నారు. ఈ నెల 31 లోగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందని వివరించారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: 2020 సంవత్సరంలో రూ.1000 చెల్లించి, ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించిందని ఎంపీడీఓ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారుడు ఎల్‌ఆర్‌ఎస్ కింద 25 శాతం రాయితీతో డబ్బు చెల్లించి, అనధికార లే అవుట్లలోని తమ స్థలాలను క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించారు.

కలెక్టరేట్ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ పెంచాలి

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం డిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 24 శాతానికి పెంచి ఇవ్వాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరీలు కోరారు. ఈ మేరకు సోమవారం ఐటీ పరిశ్రమల శాఖ, వాణిజ్య, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆయన నివాసంలో కలిసి వినతిప్రతం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తమ ప్రమేయం లేకుండానే నగరం నడిబొడ్డున లక్డీకాపూల్‌లో ఉన్న కలెక్టరేట్‌తో పాటు ఇతర కార్యాలయాలను కొంగరకలాన్‌కు మార్చిందని ఆరోపించారు. ఇక్కడ సుమారు 600 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని వివరించారు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ.. నగరం నుంచి ఇక్కడికి వచ్చి పని చేస్తున్నామని, తమ ఇంటి అద్దె బత్యాన్ని 24 శాతం నుంచి 11 శాతానికి తగ్గించిందని తెలిపారు. కొంగరకలాన్‌లో పని చేస్తున్న వారికి ఇచ్చే బత్యాన్ని 24 శాతానికి పెంచాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఉద్యోగులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

పేదలకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

మంచాల: లోయపల్లిలో పేదలు కొనుగోలు చేసిన భూములకు పట్టాపాసు పుస్తకాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్(జేఏసీ) నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ ఎం.వి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు కొందరు, లోయపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 34,35లో 1970, 1980 సంవత్సరాల్లో అప్పు చేసి, భూములు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని పేర్కొన్నారు. నేడు తిరిగి ధరణిలో పట్టాదారుల పేర్లు రావడంతో పేదలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. దళారులను ఆశ్రయించి, అక్రమంగా తిరిగి విక్రయిస్తున్నారని ఆరోపించారు. అక్రమ విక్రయాలను నిలిపివేసి, పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు యాదయ్య, నర్సింహ, యాదయ్య, రమేష్, సత్తయ్య, అండాలు, కృష్ణయ్య, యాదమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

యాచారం: మండల పరిధి గునుగల్ గ్రామంలో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో 2004-05వ విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న బాల్య మిత్రులు ఒకే వేదికగా సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

స్వయం కృషితో ఆర్థిక ప్రగతి సాధించండి

మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుతున్న ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకుని, యువత స్వయం కృషితో ఆర్థిక ప్రగతి సాధించాలని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం చింతపట్ల గ్రామానికి చెందిన లిక్కి సుధాకర్ రెడ్డి.. రైతు మాల్ వ్యాపార కేంద్రంలో ఏర్పాటు చేసిన సంపూర్ణ అమృతుల్య బెల్లంచాయ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత ట్రెండ్‌కు తగినట్లుగా వ్యాపారం చేసుకోవాలన్నారు. వ్యాపారంలో ఆదాయం ఉంటుందని, దానికి కావాల్సింది కష్టపడే తత్వం అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు. బెల్లం చాయ్ ఆరోగ్యానికి మంచిదని, నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, శ్రీనువాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, అమృతాసాగర్, కేసరి సాగర్, అరవింద్‌నాయక్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి చేయూత

కడ్తాల్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త శ్రీకాంత్ మాతృమూర్తి మంకి మైసమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి.. సోమవారం జీఎస్‌ఆర్ యువసేన నాయకుల ద్వారా తక్షణ ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో యువసేన నాయకులు సతీశ్, సైదులు గౌడ్, సుమన్‌నాయక్, మణికంఠ, అంజి, సురేశ్, కర్ణాకర్, మహేశ్, నిఖిల్, శివ, నవీన్, రమేశ్ తదితరులు ఉన్నారు.

క్రమం తప్పకుండా నీటి సరఫరా చేయాలని వినతి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

మీర్‌పేట: వేసవి దృష్ట్యా జిల్లెలగూడ ప్రాంతంలో రోజు విడిచి రోజు మంచినీటిని సరఫరా చేయాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ సోమవారం జలమండలి మేనేజర్ ప్రమోద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లెలగూడ పరిధిలోని సాయిరాంనగర్, ఓంకార్‌నగర్, బల్లారి రాఘవాకాలనీ, బీరప్పగడ్డ, కమలానగర్, వెంకటసాయి ఎన్‌క్లేవ్, బాలాజీ ఎన్‌క్లేవ్, దాసరి నారాయణకాలనీల్లో వారానికి రెండుసార్లు మాత్రమే నీరు సరఫరా అవుతోందని, వేసవి కావడంతో నీరు సరిపోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మేనేజర్‌కు వివరించారు. నాలుగు రోజుల్లోగా పైకాలనీలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తామని మేనేజర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఆత్మీయ సమావేశం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ సాయినగర్‌-2లో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు ఆమెను ఘనంగా సత్కరించారు. పదవీ ఉన్నా లేకున్నా ప్రజలకు అండగా ఉంటానని పారిజాత పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీశెట్టి మనోహర్, గిరిముదిరాజ్, భాను, కాలనీ కమిటీ సభ్యులు, మహిళలు ఉన్నారు.

ప్రకృతి వనం.. పరిశుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

కడ్తాల్: 'ప్రకృతి వనం అధ్వానం' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన వార్తా కథనానికి ఎంపీడీఓ సుజాత స్పందించారు. పల్లె ప్రకృతి వనంలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు సోమవారం కార్యదర్శి అల్లాజీ.. పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించారు. మొక్కలకు బోరు మోటారు ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా 'ప్రకృతి వనం' దుస్థితిని వెలుగులోకి తెచ్చి, వినియోగంలోకి వచ్చేలా చేసిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న జీపీ సిబ్బంది

రైతులకు అండగా ఐక్యత ఫౌండేషన్



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: రైతులకు అండగా ఐక్యత ఫౌండేషన్ ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన 25 మంది రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్‌కు సాంకేతిక సమస్య వచ్చింది. రైతుల ఇబ్బంది తెలుసుకున్న సుంకిరెడ్డి.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.46 వేలతో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయించి, సోమవారం రైతులతో కలిసి ప్రారంభించారు. పొలాలకు నీరు అందించారు. ఈ సందర్భంగా రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు ఖాదర్, కృష్ణ, చెన్నయ్య, కొండల్, చంద్రయ్య, అల్లాజీ, జంగయ్య, అంజయ్య, ఈదన్న, పర్వతాలు, రమేశ్, వెంకటయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

తుర్కయంజాల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, రైతుసేవా సహకార సంఘం తుర్కయంజాల్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 మంది రైతులకు రూ.ఒక కోటి 50 లక్షల రుణాలను మంజూరు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా 13 మంది సభ్యులను చేర్చుకున్నామని చెప్పారు. సమావేశంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవ రెడ్డి, కొండ్రు స్వప్న, చాపల యాదగిరి, లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సెక్రటరీ వై. రాందాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్ పర్సన్ లీలా, ఉపాధ్యాయులు, విద్యార్థులు

- వన్య ప్రాణులు, వృక్ష సంపదను కాపాడుకోవాలి
- సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి

కడ్తాల్: పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు.. అంతరించి పోతున్న జీవ జాతులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. ఇదే విషయంలో ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సోమవారం మండల పరిధి అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో నేదునూర్ మోడల్ స్కూల్‌లో ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడాతూ.. పర్యావరణ మార్పులు, విపత్తులు, మానవ తప్పిదాల వలన ఎన్నో జీవ జాతులు కనుమరుగవుతున్నాయని పేర్కొన్నారు. ప్రకృతిలో ఏ జంతువు, మొక్క నిరుపయోగం కాదని, ప్రతి జీవి తన పరిధిలో ఎంతో కొంత ప్రకృతికి మేలు చేస్తుందని తెలిపారు. వన్య ప్రాణులను, వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వాటి ఆవాసాలకు నష్టం కలగకుండా మన జీవన విధానం కొనసాగించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, పుడమి తల్లికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలపాలన్నారు. అనంతరం జీవ జాతులు, వన్య ప్రాణుల సంరక్షణకు కృషి చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు డాక్టర్ వెంకటరమణ, వేను గోపాల్, కిరణ్, మహి, హరీశ్, సీజీఆర్ ప్రతినిధులు జ్ఞానేశ్వర్, నాగేశ్, రజనీకాంత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ సర్కార్

- ఫార్మాసిటీని రద్దు చేశాం.. ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నాం
- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి



రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో కోదండరెడ్డిని కలిసిన సునీలం తదితరులు

యాచారం: రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేసిందని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. రెండు రోజుల క్రిత మండల పరిధి తాడిపర్తిలో పర్యటించిన మధ్యప్రదేశ్ కిసాన్ సంఘర్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ సునీలం, ఉపాధ్యక్షుడు సుశీలతాయి, పశ్చిమ ఒడిశా కిసాన్ సంఘటన సమన్వయ సమితి కన్వీనర్ లింగరాజ్ తదితరులు సోమవారం నగరంలోని రైతు కమిషన్ కార్యాలయంలో ముదిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. 'మీరనుకున్నట్లుగా ఫార్మాసిటీ ఇక రాదు. రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణాస్వీకారం చేసిన కొద్ది రోజులకే ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాం. ప్రపంచస్థాయికి దీటుగా ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నామని' తెలిపారు. రైతులకు అండగానే ఉంటామని, వారి పక్షాన ఏళ్లుగా ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేశానని చెప్పారు. కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తు రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఫ్యూచర్‌సిటీలో రైతులను భాగస్వాములను చేస్తామని, బలవంత భూసేకరణ చేయబోమని వివరించారు. త్వరలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తాను కలిసి, రైతులతో సమావేశమై వారికి న్యాయం చేసేలా కృషి చేస్తామని వెల్లడించారు. ఫార్మాసిటీ పేరుతో సర్కార్‌ను, సీఎంను కించపర్చేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

రేపు ముదిరాజ్‌ల కృతజ్ఞత సభ

మహేశ్వరం: ముదిరాజ్‌ల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గుండెమోని అంజయ్య ముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. దేశంలో ఏ రాష్ట్రాల్లో లేని విధంగా బీసీల కులగణన చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీ సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీసీల కులగణన జరిపి ముదిరాజ్ కులస్తులే అత్యధికంగా జనాభా కలిగి ఉందని తేల్చిందన్నారు. బీసీల కులగణన చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ నెల 5న బుధవారం ఉదయం 10 గంటలకు తొండుపల్లి, శంషాబాద్ ఎంఎస్ గార్డెన్‌లో సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు ప్రతి ముదిరాజ్ నాయకుడు హాజరై విజయవంతం చేయాలని కోరారు.